

## 'సిరికొండ'కు శుభాకాంక్షల వెల్లువ

తెలంగాణ శాసనమండలి ప్రతిపక్షనేతగా నియమితులైన పూర్వ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారికి శుభాకాంక్షల వెల్లువెత్తాయి. చారి నియామకం పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హర్షం వ్యక్తం చేశారు. వరంగల్ వాయిస్ దినపత్రిక ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి, ప్రముఖ కాంట్రాక్టర్ ఎంఎన్ మూర్తితోపాటు పలువురు బుధవారం హైదరాబాద్‌లోని మధుసూదనచారి స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

-వరంగల్ వాయిస్, వరంగల్


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 334 | బుధవారం | 24 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


# మల్లక్కపేట పెద్ద చెరువుకు గండి ముప్పు

### బీటలు వారుతున్న కట్ట



వివరాలు 2లో..

**ఎప్పుడు కొట్టుకుపోతుందో నన్న ఆందోళన**

**మొరం పోసి బిల్లులు డ్రా చేయడంపై ఆగ్రహం**

**కట్ట కోతకు గురి కాకుండా చర్యలు చేపట్టాలంటున్న అన్నదాతలు**

పరకాల మండలం మల్లక్కపేట గ్రామంలోని పెద్ద చెరువుకు మళ్ళీ 'గండి' ప్రమాదం పొంచి ఉంది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో ఈ చెరువుకు రెండు గండ్లు పడడంతో ఆయకట్టు శివారు ప్రాంతాలు, పంట పొలాలు పూర్తిగా నీటిలో మునిగి అధిక మొత్తంలో నష్టపోయారు. గండ్లు పూడ్చేందుకు రూ.16.50 లక్షలతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను నాసిరకంగా పూర్తి చేయడంతో మళ్లీ గండి పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గండి పడిన ప్రాంతంలో కాంక్రీట్, రాతితో కట్టడాలు నిర్మించి దానిపైన మొరం పోయాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ ఇవేమీ పట్టించుకోకుండా కేవలం మొరం పోసి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో చెరువులోకి పెద్ద మొత్తంలో వచ్చి చేరుతున్న నీటి అలలకు కట్ట కుంగిపోతూ బీటలు వారుతోందని స్థానికులు, రైతులు ఆరోపిస్తున్నారు. చెరువులోకి మరింత నీటి ప్రవాహం వచ్చి చేరితే కట్ట మరోసారి కోతకు గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు. నాణ్యతతో గండి పూడ్చని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవడంతోపాటు మరో మారు కట్ట కోతకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - వరంగల్ వాయిస్, పరకాల



8లో

## తెలంగాణపై మోడీ వివక్ష

**బీజేపీ ఎంపీలు ప్రజలకు సమాధానం చెప్పాలి**

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



2లో

## ఘనంగా కట్ట మైసమ్మ బోనాలు



2లో..

## బాలుడిపై వీధి కుక్కల దాడి

**తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలింపు**

## పోలీసుల బదిలీలు



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పలువురికి స్థానచలనం కలిగింది. 13మంది ఏఎస్సైలు, 40 మంది హెడ్ కానిస్టేబుల్స్, నలుగురు కానిస్టేబుళ్లకు కౌన్సిలింగ్ పద్దతిలో వారు ఎంపిక చేసుకున్న పోలీస్ స్టేషన్లకు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో బదిలీపై వెళ్లిన వారు రిపోర్టింగ్ చేశారు. - వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

# మల్లక్కపేట పెద్ద చెరువుకు.. గండి ముప్పు

**బీటలువారుతున్న కట్ట**

**ఎప్పుడు కొట్టుకుపోతుందోనన్న ఆందోళన**

**మొరం పోసి బిల్లులు డ్రా చేయడంపై ఆగ్రహం**

**కట్ట కోతకు గురి కాకుండా చర్యలు చేపట్టాలంటున్న అన్నదాతలు**





**వరంగల్ వాయిస్, పరకాల :** గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు మల్లక్క పేట పెద్ద చెరువుకు రెండు గండ్లు పడ్డాయి. దీంతో ఆయకట్టు శివారులోని కాలువలు వరద తాకిడికి పూర్తిగా ధ్వంసమయ్యాయి. పంటపొలాలు నీటిలో మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో అవి పనికిరాకుండా మారాయి. దీంతో వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న 285 కుంటుంబాలు బజారు పాలయ్యాయి. తినడానికి తిండి లేక అలమటించాయి. దీంతో పలువురు పట్టణాలకు వలస పోగా మరికొందరు అధిక మొత్తంలో ఖర్చు చేసి పొలాల్లోని ఇసుక మేటలను తొలగించుకున్నారు. ఈ ఏడైనా వర్షాలు సంమృద్ధిగా కురిస్తే తిండికి తిప్పలుండదన్న భావనతో భూమినే నమ్ముకున్న రైతులు పొలం బాట పట్టారు.

## మొరం పోశారు..

మల్లక్క పేట పెద్ద చెరువు గండ్లను పూడ్చేందుకు ప్రభుత్వం రూ.16.50 లక్షలు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యతతో పనులు పూర్చి చేయాలన్న విషయాన్ని పక్కనబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంక్రీట్, బం రాళ్లను ఉపయోగించి తొలుత కట్టను నిర్మించి తర్వాత దానిని మొరంతో నింపాల్సి ఉన్నప్పటికీ తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారన్న విమర్శలున్నాయి. మట్టిని కూడా పాత కట్ట ఎత్తులో కాకుండా లోతుగా పోయడంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కట్ట మరింత కుంగి పోయిందని స్థానికులు, రైతులు ఆరోపిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాల్సిన ప్రభుత్వ అధికారులు కాంట్రాక్టర్ ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి పనులను చూసి చూడనట్లు వ్యవహరించారన్న విమర్శలున్నాయి.

## బీటలువారుతున్న కట్ట..

నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన పెద్ద చెరువు కట్టకు గండి పడే అవకాశం పొంచి ఉందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి భారీ మొత్తంలో నీరు చేరడంతో వాటి అలల తాకిడికి మట్టి జాలువారుతోందని, దీంతో కట్టకు బీటలు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు చుట్టూ 365 ఎకరాల ఆయకట్టు ఉండగా 285 మంది నిరుపేద రైతులు వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనోపాధి పొందుతున్నారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు పర్యవేక్షణ లోపంతో సంవత్సరం గడువక ముందే చెరువు కట్టకు పగుల్లు ఏర్పడుతున్నాయి. మట్టి జాలువారుతూ కుంగుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే చెరువుకు కోత తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే జరిగితే చెరువునే నమ్ముకొని వ్యవసాయం చేస్తున్న రైతులకు ఆత్మహత్యలే శరణ్యమంటూ హెచ్చరిస్తున్నారు.

## చర్యలు చేపట్టాలి..

మల్లక్కపేట చెరువును రైతులు గురుజాల బంటి, డేంగు నవీన్, పైడిపాల కుమారస్వామి, పైడిపాల నవీన్ తదితరులు పరిశీలించిన మరోమారు గండి పడకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీటలువారుతున్న చెరుకువ కట్టకు గత కాంట్రాక్టర్ తోనే మరమ్మతులు చేయించాని కోరుతున్నారు. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.



# ఘనంగా కట్ట మైసమ్మ బోనాలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సమ్మయ్య నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కట్ట మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ బోనాల వేడుకల్లో సమ్మయ్య నగర్ తో పాటు పరిసరాల్లోని కాలనీ వాసులు పాల్గొని ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చుతూ భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారిని ప్రతి సంవత్సరం ఆశాడ మాసంలో ఘనంగా కొలుచుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మడిపల్లీ సాంబయ్య, పోతుగంటి ఎల్లస్వామి, జీడిమెట్ల రవి, డెంగు దామోదర్, జిలకర స్వామి, జిల్లపల్లి సుధాకర్, మడిపల్లి నరేష్, గూడూరు సురేష్, నర్వ మహేందర్, డెంగు నగేష్, గూడూరు సదానందం, తౌటం పెద్ద వెంకటయ్య, రావుల నరసింహ, రావుల వెంకటేష్, తుల శ్రీనివాస్, దేవర సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి నిరసన

**పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు మొండి చేయి చూపడాన్ని నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని నినదించారు. ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో వరంగల్ వేదికగా స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ కాజీపేట రైల్వే డివిజన్, మామునూర్ ఎయిర్ పోర్టు, సమ్మక్క-సారక్క జాతరకు జాతీయ హోదా, వరంగల్ నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధి, వరంగల్ హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, ఐఐఎం తదితర మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చి బడ్జెట్ లో ఆ విషయాలను తుంగలో తొక్కారని ఎంపీ ఆరోపించారు. అదేవిధంగా తెలంగాణ ప్రాంతానికి పారిశ్రామికీకరణకు ఉపయోగపడే బయ్యారం ఉక్కు పరిశ్రమ, సేద్యపు నీటి రంగానికి ఉపయోగపడే పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా వంటి అంశాలకు కూడా బడ్జెట్ లో చోటు ఇవ్వకపోవడం పట్ల డాక్టర్ కడియం కావ్య తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ఇండియా కూటమి ఎంపీలతో నిరసనలో పాల్గొన్న డాక్టర్ కడియం కావ్య భవిష్యత్తులో చేపట్టబోయే అన్ని ప్రతిఘటన పోరాటాల్లో కీలకపాత్ర పోషిస్తానని స్పష్టం చేశారు.

# బాలుడిపై వీధి కుక్కల దాడి

**తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలింపు**



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన బాసాని మనోజ్ కుమారుడు విహాన్ బుధవారం ఉదయం ఇంటిముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు కరవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ముక్కు, కనురెప్ప, తలపై గాయాలయ్యాయి. అప్రమత్తమైన బాలుడి తల్లిదండ్రులు కుక్కలను చెదరగొట్టి వెంటనే బాలుడిని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించి చికిత్స చెయిస్తున్నారు.

## వీధి కుక్కల బెడద..

పర్వతగిరి మండలంలోని ప్రతి గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైంది. కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేయడంతో గ్రామీణులు బెంబేలెత్తుతున్నారు. వీది కుక్కల భయంతో ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే జనం జంకుతున్నారు. పలు గ్రామాల్లో వీధి దీపాలు సైతం సరిగా లేకపోవడంతో కుక్కల బెడద ఎక్కువవుతోంది. పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లేవారిపై కుక్కలు దాడికి పాల్పడుతుండడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలు, కార్లలో వెళ్లే వారిని కుక్కలు వెంబడిస్తున్నాయి. దీంతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లే వారు సైతం కుక్కల బాధితులుగా మారుతున్నారు. హొటల్స్, బిర్యానీ సెంటర్లు, చికెన్ సెంటర్ల యజమానులు వ్యర్థాలను విచ్చలవిడిగా పారవేయడంతో వాటిని ఆరగించేందుకు గుంపులు గుంపులుగా చేరుకుతున్న వీది కుక్కలు అటుగా వచ్చే వారిపై దాడికి పాల్పడుతున్నాయి. జంతు సంతాన నిరోధక కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. శునకాలను నియంత్రణ కేంద్రాలకు తీసుకువెళ్లి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించాలన్న డిమాండ్ పెరుగుతోంది. అనంతరం రేబిస్ టీకా ఇప్పించి ఎక్కడి నుంచి వాటిని తీసుకొచ్చారో అక్కడే వదిలివేయాల్సి ఉంటుంది. మండల వ్యాప్తంగా ఎక్కడా ఇలా జరగడం లేదన్న విమర్శలున్నాయి. వీధి కుక్కలకు టీకాలు వేయాల్సి ఉండగా అధికారులు పట్టించుకోకపోవడంతో కుక్కల బారిన పడిన వారు మృతి చెందిన సంఘటలలు కూడా రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధి కుక్కలపై ప్రత్యేక చొరవ చూపి సరైన టీకాలు వేయించి వీధి కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ చేయించాలని, కుక్కల బారి నుంచి పట్టణ ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

## పీడీఎస్‌యూ నాయకుల అక్రమ అరెస్టు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో విద్య రంగ సమస్యలు పరిష్కరించాలని అడిగితే అక్రమంగా అరెస్టు చేస్తారా? ప్రజా పాలన అంటే ఇదేనా? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పీడీఎస్ యూ నాయకులు ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం లాగానే కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా విద్య రంగం పట్ల సరైన ప్రణాళిక లేకపోవటం వల్లనే ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని, యూనివర్సిటీలలో వీసీలను నియమించ లేదన్నారు. ఇప్పటివరకు పూర్తి స్థాయిలో పాఠశాలలకు పాఠ్యపుస్తకలు కూడా అందలేదు. ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యలకు నిలయాలుగా మారిపోయాయి. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి చెందాలంటే ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్, ఫీజు రియింబర్స్ మెంట్, హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని అడిగితే పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడం ఎంతవరకు సమంజసమన్నారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీ, రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు చేసిన పీడీఎస్ యూ విద్యార్థి సంఘ నాయకుల అక్రమ అరెస్టులను విద్యార్థులు, మేధావులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు, వివిధ రాజకీయ పక్షాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్, పీడీఎస్ యూ(సీపీఐఎంఎల్, ప్రజాపంథా )మాస్ లైన్ పార్టీ అనుబంధం) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు, కాకతీయ యూనివర్సిటీ పీడీఎస్ యూ (సీపీఐఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ అనుబంధం) అధ్యక్షుడు మర్రి మహేష్, కార్యదర్శి గణేష్, వినయ్ తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఒకటో వార్డ్ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వార్డులో కలియ తిరుగుతూ ప్రజల దగ్గరికి వెళ్లి సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన కల్పిస్తూ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వార్డు ప్రజలు పారిశుద్ధ కార్మికులకు సహకరించాలని కోరారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా డస్ట్ బిన్లలో వేయాలని, చెత్త స్వచ్ఛ ఆటోలలో, ట్రాక్టర్లల్లో వేయాలని తెలిపారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. వార్డులో దోమల మందు పాగింగ్ చేయించాలని, బ్లీచింగ్ చల్లించాలని, పట్టణ, వార్డు ప్రజలు ఆరోగ్యంగా ఉండే విధంగా చైర్‌పర్సన్, కమిషనర్, చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోనోకార్బస్ చెట్ల తొలిగింపు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మున్సిపాలిటీలో గతంలో డివైడర్ల మధ్య కోనోకార్బస్ మొక్కలను నాటారు. ప్రపంచ వ్యాప్తంగా కోనోకార్బస్ మొక్కలు ముషులకు, పశు పక్షాదులకు హానికరం చేస్తాయని ఇటీవల కాలంలో తెలియడంతో వాటిని మున్సిపల్ అధికారులు తొలగిస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు ప్రజాధనం వృధా కాకుండా మానవాళికి ఉపయోగకరమైన మొక్కలు పెంచాలని పలువురు సూచిస్తున్నారు.

# ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడేది పీఆర్టీయూ

### ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి

**వరంగల్ వాయిస్, నడికూడ :** ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడేది పీఆర్టీయూ మాత్రమేనని, సంఘ పటిష్టతకు ప్రతి ఉపాధ్యాయుడికి సభ్యత్వం ఇవ్వవలసిందిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి ఉపాధ్యాయులను కోరారు. పీఆర్టీయూ టీఎస్ నడికూడ మండల శాఖ అధ్యక్షుడు అచ్చ సుదర్శన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు సాధించి ఉపాధ్యాయులకు జేఎల్, ఎంఈఓ, డిప్యూటీవోలుగా, ఏడీలుగా అందరూ ఉపాధ్యాయులు సమానంగా పదోన్నతులు పొందడానికి అవకాశం కలిగే విధంగా కృషి చేస్తామన్నారు. పెండింగ్ ఐదు డీఏలలో మూడు డీఏలను ఇప్పిచ్చే విధంగా కృషి చేస్తామని, పీఆర్సీ ఫిట్ మెంట్ 35శాతం పెంచే విధంగా, నగదు రహిత హెల్త్ కార్డులను ఇప్పించి అన్ని కార్పొరేట్ హాస్పిటల్





లో వైద్యం అందే విధంగా, ప్రభుత్వం ఇంతకుముందే ఒప్పుకున్న విధంగా 5550 పీఎస్, హెచ్ఎం పోస్ట్ మంజూరు చేయించి, జీవో నెంబర్ 12 సవరించి, బీఈడీ అర్హతలు ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులకు అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని తెలిపారు. అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యుత్ బిల్లులు ప్రభుత్వం కట్టే విధంగా, సర్వీస్ పర్సన్స్ నియమించే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు. సంఘం పటిష్టంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని, సంఘ సభ్యత్వాన్ని అందరూ ఇవ్వవలసిందిగా కోరారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంఠాత్మకూర్, కౌకొండ, నడికూడ, రాయపర్తి, చర్లపల్లి, పులిగిల్ల, చౌటుపర్తి పాఠశాలలో సభ్యత నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గొట్టేముక్కుల శ్రీనివాస్ రెడ్డి, నన్నసాహెబ్, పరకాల మండల శాఖ అధ్యక్షుడు దగ్గు తిరుపతిరావు, మాజీ అధ్యక్షుడు మోడం రాజేందర్ బాబు, బూర శంకర్రావు, చెరిపెల్లి ప్రేమానందం, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచెయ్యి

### కేయూ ఈసీ మెంబర్ చిర్రా రాజు గౌడ్



**వరంగల్ వాయిస్, సుబేదారి :** ఆర్ట్స్ కళాశాల ఎకనామిక్స్ విభాగం శాఖధిపతి డాక్టర్ శ్రీధర్ లోధ్ అధ్యక్షతన బుధవారం ఆర్ట్స్ కళాశాలలో కేంద్ర బడ్జెట్ పై విశ్లేషణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి, ప్రధాన విశ్లేషకులుగా డాక్టర్ శేషు, అతిథిగా కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు కేంద్రం మొండి చెయ్యి చూపిందని, తెలంగాణ రాష్ట్రం కేటాయించిన బడ్జెట్ అతి తక్కువ, పాలమూరు రంగారెడ్డికి జాతీయ హెూదా ఇవ్వలేదన్నారు. గిరిజన వర్సిటీ బడ్జెట్ కేటాయింపులు చేయలేదని, కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఉక్కు కర్మాగారం సహా విభజన చట్టం హామీలు ఏమి కూడా ఈ బడ్జెట్ లో ప్రవేశ పెట్టలేదన్నారు. ఈ బడ్జెట్ ను తెలంగాణ ప్రజల తీవ్రంగా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల పీఆర్ఓ డాక్టర్ ఆదిరెడ్డి, ఎకనామిక్స్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



**వరంగల్ వాయిస్ మహబూబాబాద్ :** ప్రజా రవాణాలో ప్రయాణికుల భద్రత ..సురక్షిత ప్రయాణం కోసం బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని డీఎస్పీ తిరుపతి రావు కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపోలో నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాలను బుధవారం డీఎస్పీ తిరుపతి రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అతి వేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు సంభవించి కుటుంబాలు పెద్ద దిక్కులను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ డిపోలను ప్రమాద రహిత డిపోలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రమాద రహిత కార్యక్రమాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు ఆర్టీసీ సంస్థ రూపొందించిన కరపత్రాలను డీఎస్పీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శివ ప్రసాద్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న మోడీ

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించినందుకు రాష్ట్రానికి ప్రత్యేక బడ్జెట్ లో నిధులేమైన కేటాయిస్తారని ఆశపడ్డ ప్రజలకు మోడీ ప్రభుత్వం మొండి చేయి చూపెట్టిందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కేంద్ర ప్రభుత్వం ఎంతో కోంత రాష్ట్రానికి సముచిత స్థానం కల్పిస్తూ బడ్జెట్లో నిధులు కేటాయిస్తారని ఎదురు చూశారని, కానీ, మళ్లీ మళ్లీ మోడీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తూనే ఉందన్నారు. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బీజేపీ కుటిల నీతికి నిదర్శనమన్నారు. నలభై ఎనిమిది లక్షలు ఇరవై ఒక్కవేల కోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ కేవలం బీహార్, ఆంధ్రప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేయడం చూస్తుంటే కుర్చీ కోసం వారి కూటమి ఉన్న రాష్ట్రాలకే ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నచోట్ల వివక్ష చూపిస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. రాష్ట్రానికి ఆంధ్రప్రదేశ్ పునర్విజన చట్టంలో దాదాపు ముప్పై అయిదు హామీలపై ఈ బడ్జెట్ లో కూడా సముచిత న్యాయం లేదన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, ములుగు గిరిజన యూనివర్సిటీకి అదనపు నిధులు ఊసే లేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హెూదా, ఐఐఎం సహా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ వంటి



కేంద్ర జాతీయ సంస్థలలో తెలంగాణకు వివక్ష చూపి అన్యాయం చేశారన్నారు. రాష్ట్ర బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు తెలంగాణ ప్రజల ముందుకు ఏ ముఖం పెట్టుకొని వస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టౌన్ అధ్యక్షుడు కూసం రాంచందర్, మండల ఎస్టీ సెల్ నాయకులు భాస్కర్, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు బొట్ల మహేంద్ర, జిల్లా కో ఆప్షన్ నెంబర్ ఎండీ సర్వర్, సొసైటీ డైరెక్టర్ జూలపల్లి గంగాధర్ రావు, బీసీ నాయకులు చింతకుంట్ల మల్లికార్జున్, కంటెం సుధాకర్, జంగ సాంబయ్యు, పోకల శంకర్, చెరుకొమ్ము తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు బావ్ సింగ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలకు ఆశాకిరణం కేటీఆర్

## మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి, సిరిసిల్ల శాసనసభ్యుడు కల్వకుంట్ల తారక రామారావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా భద్రకాళి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేటీఆర్ పేరిట అర్చన, అభిషేకం చేయించారు. అనంతరం ధార్మిక భవనంలోని వేద పాఠశాల విద్యార్థులకు వేద గ్రంథాలను, వస్త్రాలను కేటీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా అందజేశారు. హనుమకొండ చౌరస్తా ప్రాంతం, సుబేదారి, బాలసముద్రం, అదాలత్, ప్రాంతాల్లో రోడ్ల వెంట ఉన్న చిరువ్యాపారులకు గొడుగులను అందజేశారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను పార్టీ శ్రేణుల సమక్షంలో కట్ చేశారు. పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అదాలత్‌లోని మదర్సాలలో విద్యార్థులకు పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ చేశారు. టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు దాస్యం విజయ్ భాస్కర్, జోరిక రమేష్, సిరాజుద్దీన్, మేకల బాబురావు, కుసుమ లక్ష్మీ నారాయణ, తండమల్ల వేణు, మాజీ ఎంపీపీ రఘు, నాయకులు నరెడ్ల శ్రీధర్, సల్వాజీ రవీందర్ రావు, బుద్దె వెంకన్న, రామ్మూర్తి, మైనార్టీ నాయకులు నయీమొద్దీన్, ఖుద్దూస్, డివిజన్ అధ్యక్షులు, విద్యార్థి నాయకులు, యువజన నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 48వ జన్మదిన వేడుకలు శాయంపేట మండల కేంద్రంలో బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి కేటీఆర్ జన్మదిన కేక్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ నందం, మాజీ వైస్ ఎంపీపీ రామ్ శెట్టి లతా లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ లు ప్రసాద్, పోతు సుమలత రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మేకల శ్రీనివాస్, తహరాపూర్, గొట్టిముక్కుల స్వాతి విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు మారపల్లి మోహన్, దైనంపల్లి కరుణబాబు, శాయంపేట గ్రామ శాఖ అధ్యక్షుడు గాజే రాజేందర్, ఎండీ రాజ్ మహ్మద్, పత్తిపాక గ్రామ శాఖ అధ్యక్షుడు పసుల ప్రవీణ్, యూత్ నాయకులు కొమ్ముల సంతోష్, తెలంగాణ ఉద్యమ నాయకుడు గంట శ్యాంసుందర్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, రంగు మహేందర్, మేకల వెంకన్న, సోషల్ మీడియా కన్వీనర్ దైనంపల్లి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదో డివిజన్‌లో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ ప్రభుత్వ చీఫ్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా ప్రెసిడెంట్ దాస్యం వినయ్ భాస్కర్ సూచనల మేరకు తెలంగాణ మాజీ ఐటీ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం 5వ డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్ ఆధ్వర్యంలో కొత్తూరు జెండా పోచమ్మ గుడి దగ్గర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పండగ సాగర్, అరవింద్, నారాయణగిరి రాజు, దాసరి సమ్మన్న, విశాల్, రవి, ప్రభాకర్, రాము, వికాస్, మురళి, వెంకన్న, భాస్కర్, ప్రభాకర్, రవళి, ప్రవళిక, రమక్క, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు 48వ జన్మదిన వేడుకల సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పొడి శెట్టి గణేష్, మైలారం, పత్తిపాక గ్రామ శాఖ అధ్యక్షులు చల్ల శ్రీనివాసరెడ్డి, పసుల ప్రవీణ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు రాజమహమ్మద్, బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు అరికెళ్ల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## భీమదేవరపల్లిలో..



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 48వ జన్మదిన వేడుకలు భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం కార్యకర్తల నడుమ ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మండల సురేందర్ అధ్యక్షతన గ్రామ శాఖ అధ్యక్షుడు శనిగరపు సదానందం ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన కేక్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సల్పాల తిరుపతి, మాడుగుల అశోక్, ఎదులాపురం మొగిలి, గద్ద కుమార్, రచ్చ సంపత్, బుర్ర స్వామి, గుడికందుల రాజు, గుడికందుల పూర్ణచందర్, రాగం రమేష్, మాడుగుల రమేష్, మాడుగుల సుభాష్, అనిల్, సుర రవి తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన చల్లా



**వరంగల్ వాయిస్, పరకాల :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు సందర్భంగా బుధవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హైదారాబాద్ లో వారిని కలిసి పుష్పగుచ్చం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

## కాటారంలో..



**వరంగల్ వాయిస్, కాటారం:** బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు 48వ జన్మదిన వేడుకలు కాటారం మండలంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జి జోడు శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన గారేపెల్లి అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంథని డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పంతకాని సడవలి, మండల ఉపాధ్యక్షులు ఊర వెంకటేశ్వరరావు, మందల లక్ష్మారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండగొర్ల వెంకటస్వామి, ఉపాధ్యక్షులు గాలి సడవలి, మహిళా నాయకురాలు శ్రీలక్ష్మీ చౌదరి, పట్టణ అధ్యక్షుడు ఉప్పు సంతోష్, తైనేని సతీష్, కాటారం గ్రామ అధ్యక్షులు కొండపర్తి రమేష్, సీనియర్ నాయకులు తూటి మనోహర్, యూత్ నాయకులు అశోక్, మహిళా నాయకురాలు మమత, నాగమణి, బయ్యారం అధ్యక్షుడు మొండయ్య, సోషల్ మీడియా ఇంచార్జులు మాడెం రాజబాబు, మేడిగడ్డ దుర్గారావు, రాజబాబు, యూత్ నాయకులు పసుల శంకర్, దేవేందర్, రజినీకాంత్, మస్తూర్తి రాజకుమార్, రత్నాకర్, జాడి శ్రీశైలం, ఘంటా సమ్మయ్య, వంశీ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వాన కవర్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి వారి స్వగ్రామం వంగపహాడ్ గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో వాన కాగితాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా జీవితంలో నాయకుల పుట్టిన రోజు నలుగురికి ఉపయోగపడాలన్న సదుద్దేశ్యంలో భాగంగా బుధవారం కల్వకుంట్ల తారక రామన్న పుట్టినరోజు పురస్కరించుకొని వ్యవసాయ క్షేత్రాల్లో నాట్లు వేస్తున్న తల్లులకు వాన కాగితాలు బహూకరించడం జరిగిందన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా బహుకరించిన ఈ వాన కాగితాలు వర్షాకాలం గ్రామాల్లో నాట్లకు వెళ్లే మహిళలకు అధ్భుతంగా ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రవి నాయక్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాలమాకుల కొమురన్న, బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి జెట్టి రాజేందర్, దేవయ్య, పిన్నింటి విజయ్, భాస్కర్, వెంకటేష్, రఘుపతి రెడ్డి, రంగా రెడ్డి, రాజేష్, తోట శ్రీధర్, సతీష్, ధనుంజయ్, వెంకటేష్, హరీష్, రజినీ కాంత్ లు తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరు మండల కేంద్రంలో..



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదినం సందర్భంగా తొర్రూరు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేటీఆర్ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై కేక్ ను కోసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, సోషల్ మీడియా నాయకులు, యూత్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అంధుల పాఠశాలలో..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను వరంగల్ నగరంలో ఘనంగా నిర్వహించారు. భారత జాగృతి నాయకుడు మడిపెల్లి సుశీల్ గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ ఆటో నగర్ లో ఉన్న లూయిస్ అంధుల పాఠశాలలో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు.

# రైతు రుణమాఫీ పథకం అమలుపై సమీక్ష



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో బుధవారం బ్యాంకర్లు, వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో రైతు రుణమాఫీ పథకం అమలుపై జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ పథకం అమలు జిల్లాలో 27వేల 652 మంది రైతు కుటుంబాలకు, రూ,156, కోట్ల 2 లక్షల 60 వెలు రైతు రుణమాఫీ నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. నిన్నటి వరకు (3316) మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ డబ్బులు రూ.20 కోట్ల 39 లక్షల 72 వేలు రైతుల సేవింగ్ అకౌంట్ లోకి జమ అయ్యాయని ఆయన పేర్కొన్నారు. రైతు రుణమాఫీ అమలులో వెనుకంజలో ఉన్న బ్యాంకుల వారీగా వివరాలు అడిగి తెలుసుకుని వెంటనే విడుదల చేయుటకు ఆదేశాలు జారీ చేశారు. ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు, తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. మిగిలిన రుణమాఫీ నిధులను రైతుల సేవింగ్ అకౌంట్ లోకి త్వరగా విడుదల చేయాలని అందుకు బ్యాంకర్లు వ్యవసాయ సహకార శాఖ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి వెంట వెంటనే అమలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకు సమయాలు, పెంచి వారికి సేవలు అందించాలని ఆయన సూచించారు. డీసీసీబీ (సహకార) సంఘాలు ఖమ్మం, వరంగల్ అధికారులు వారి బ్రాంచ్ లలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి రైతులకు రుణమాఫీ నిధులు మంజూరు చేయాలన్నారు. రుణమాఫీ పథకం అమలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని విధులలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, డీసీఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి కె.అభిమన్యుడు, లీడ్ బ్యాంక్ డిస్టిక్ మేనేజర్ మూర్తి, వ్యవసాయ సహకార, శాఖ అధికారులు, బ్యాంకర్లు తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ జరగాలి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్పీ, ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ గుగ్గిళ్ల పీరయ్య మాదిగ హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం సుప్రీంకోర్టులో తీర్పు వెలువడే లోపే పూర్తిస్థాయి నిర్మాణం, గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరపాలన్నారు. వ్యక్తిగత చొరవ తీసుకొని తిరిగి ఏ గ్రామాల్లో ఎక్కడెక్కడ జెండాలు ఉన్నవి, ఎక్కడెక్కడ గ్రామ కమిటీలు ఉన్నావనేవి చూడాలన్నారు. జెండాలు లేని అలాగే గ్రామ కమిటీలు లేని చోట ఎవరికి వారు ప్రత్యేక చొరవ తీసుకొని నూతనంగా జెండాలు ఎత్తాలి, గ్రామ కమిటీలు వేసుకోవాలని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ వ్యక్తిగత చొరవ ఈ విషయంలో ప్రధానంగా ఉండాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత చివరి దశలో ఉంది కాబట్టి, ప్రతి ఒక్కరూ, యావత్తు జాతి మొత్తం కలిసి రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ పాషా, ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి సంఘపొంగు శ్రీనివాసు మాదిగ, జిల్లా ప్రచార కార్యదర్శి కంది పాటి భిక్షపతి, ఎమ్మీర్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోలేపాక ప్రవీణ్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షురాలు ఎండీ రజియా, ఎంఎస్పీ మహిళా జిల్లా అధికార ప్రతినిధి బోడ సుమిత్ర, మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు గుండెల సరిత, వీహెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు చలగోల వెంకన్న, ఎంఎస్పీ జిల్లా నాయకులు ఈదురు సైదులు, కందిపాటి వెంకటేష్, ఇర్గు రవి, వీహెచ్ పీఎస్ జిల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుగ్గిళ్ల నవీన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ సొసైటీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి కాకతీయ యూనివర్సిటీలో చదువుతున్న డిగ్రీ, పీజీ దివ్యాంగ బాలిక విద్యార్థులకు లాంగ్ నోట్ బుక్స్ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ చదివే పిల్లలు అంతా పేద పిల్లలని అన్నారు. పేదరికం చదువుకు ఆటంకం కారాదని భావించి నోట్ బుక్స్, స్టేషనరీ వారి చదువుకు సహరించడానికి అందించామని తెలిపారు. అలాగే విద్యార్థులు బాగా చదువు కోవాలని అన్నారు. పిల్లలు క్రమశిక్షణతో మంచి నడవడికతతో ఒక లక్ష్యం పెట్టుకొని చదువు కోవాలని పిలుపునిచ్చారు. అప్పుడే మంచి ఉద్యోగాలు వస్తాయని, ఉన్నత స్థానాలు చేరుతారని అన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని, వాటిని వినియోగించుకొనేలా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరాలని, అందివచ్చిన అవకాశాలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్దులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి మొండిచేయి

## ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర బడ్జెట్ లో బీజేపీ ప్రభుత్వం విద్యారంగానికి మొండి చేయి చూపించిందని భారత విద్యార్థి ఫెడరేషన్-ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రంగశాయిపేట ప్రభుత్వ పాఠశాలను బుధవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ బడ్జెట్ ప్రసంగంలో ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఒక్క మాట కూడా లేదని, కేంద్ర ప్రభుత్వం విద్య పట్ల ఆసక్తి లేనట్టు కనబడుతుందన్నారు. విద్యారంగానికి కనీసం పది శాతం నిధులు కేటాయించాలని విద్యా కమిషన్లు సూచించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రస్తుత బడ్జెట్ లో విద్యకు కేంద్ర ప్రభుత్వం 3.06 శాతం నిధులు కేటాయించిందన్నారు. విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేయడంలో భాగంగా అడుగులు వేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై పెద్ద ఎత్తున ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివచందర్, సాయి, లిఖిత్, శ్రీనివాస్, ఖాజా పాషా తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# బడా పారిశ్రామిక పెద్దలకే పెద్దపీట



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం మొండి చేయి చూపించిందని, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత దక్కలేదని, బడా పారిశ్రామిక పెద్దలకు పెద్దపీట వేశారని, బహుజనులకు కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై తెలంగాణ బీజేపీ ఎంపీలు నోరు విప్పాలని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోమిరెడ్డి అంజన్ రావు డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన కమలం పార్టీ దేశంలో 70శాతం పైగా ఉన్న వ్యవసాయ రంగానికి విద్య, వైద్య రంగాలకు బడ్జెట్ లో ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. బడా పారిశ్రామిక రంగాల పెద్దలైన ఆదాని, అంబానీ లాంటి బడా వ్యాపారవేత్తలకు పెద్దపీట వేస్తూ కార్మికులకు, చిన్న తరహా పరిశ్రమలకు తీవ్ర అన్యాయం చేశారని అంజన్ రావు మండిపడ్డారు. రక్షక రంగానికి ఇచ్చినంత ప్రాధాన్యత పేద, బడుగు, బలహీన వర్గాలకు ఇవ్వడం లేదని, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో సగం మంది ఎంపీలు గెలిచినప్పటికీ ఇతర రాష్ట్రాలైన బీహార్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అధిక మొత్తంలో బడ్జెట్ లో కేటాయించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంపై మోడీ ప్రభుత్వం కక్ష కట్టి సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కక్ష కట్టారని అంజన్ రావు మండిపడ్డారు. ఇప్పటికైనా బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రజల పట్ల ప్రేమ ఉంటే తెలంగాణ రాష్ట్రానికి నిధులు తేవాలని అంజన్ రావు సవాల్ చేశారు.

# పచ్చదనం- పరిశుభ్రత అందరి బాధ్యత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పచ్చదనం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో-ఎడ్యుకేషన్) ప్రిన్సిపల్ ఎస్ ధర్మేంద్ర అన్నారు. బుధవారం కళాశాలలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.ధర్మేంద్ర కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి స్వయంగా పిచ్చి మొక్కలను తొలగిస్తూ విద్యార్థులను ఉత్తేజపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ ఆధ్యాపకులు మాధవి, జీజేఎల్ఏ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఈ.శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించినందుకు రాష్ట్రానికి ప్రత్యేక బడ్జెట్ లో నిధులేమైన కేటాయిస్తారని ఆశపడ్డ ప్రజలకు మోడీ ప్రభుత్వం మొండి చేయి చూపెట్టిందని పరకాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం పరకాల పట్టణంలోని బస్టాండ్ కూడలిలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాస్తారోకో, దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ ప్రజలు కేంద్ర ప్రభుత్వం ఎంతో కోంత రాష్ట్రానికి సముచిత స్థానం కల్పిస్తూ బడ్జెట్ లో నిధులు కేటాయిస్తారని ఎదురు చూశారని కానీ, మోడీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మళ్లీ మళ్లీ మోసం చేస్తూనే ఉందన్నారు. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బీజేపీ కుటిల నీతికి నిదర్శనమన్నారు. గతంలో ఇలాంటి వివక్షనే ప్రత్యేక రాష్ట్ర సాధనకు కారణమైందన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ, ఎండీ రంజాన్ అలీ, చిన్నాల గోనాథ్, ఒంటరి రామ్మూర్తి, మెరుగు శ్రీశైలం, చందుపట్ల రాఘవరెడ్డి, మడికొండ శ్రీనివాస్, కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్, నలేళ్ల అనిల్, ఏకు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి పబ్బ శ్రీనివాస్, సదన్ కుమార్, బొమ్మ కంటి చంద్రమౌళి, జాఫర్ రిజివి, దార్న వేణుగోపాల్, గడ్డం శివ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్ల చిన్ని, పసుల విజయ, లక్కం వసంత, కోమల, ఎండీ అలీ, గొట్టే రమేష్, దుప్పటి రాజేష్, మార్క రజినీకాంత్, బొచ్చు ఆనంతు, బొచ్చు జెమిని, బొచ్చు భాస్కర్, సంపత్, సాదిక్ పాషా, భిక్షపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ వార్డు కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యూ లయోలా హైస్కూల్‌లో గ్రీన్ డే సెలబ్రేషన్స్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని కుమార్ పల్లి మార్కెట్ పరిధిలోని న్యూ లయోలా హైస్కూల్ లో బుధవారం గ్రీన్ డే సెలబ్రేషన్స్ అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులు గ్రీన్ కలర్ డ్రెస్సుల్లో హాజరై, గ్రీన్ కలర్ లో ఉన్న వస్తువులను, వెజిటేబుల్స్, ఫ్రూట్స్, యానిమల్స్ గురించి ప్రదర్శించారు. కొంతమంది విద్యార్థులు చెట్ల రూపంలో తయారై, చెట్ల ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ తాడిశెట్టి క్రాంతి కుమార్ గౌతమ బుద్ధుడికి పూలను అర్పించి, ప్రిన్సిపల్ చంద్రశేఖర్ ఉపాధ్యాయులుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్కూల్ ఆవరణను గ్రీనరీగా అలంకరించి, గ్రీనరీ ద్వారా ప్రపంచం సస్యశ్యామలంగా మారి, క్లైమేట్, ఎన్విరాన్మెంట్ కాపాడుకోవాల్సిన ఆవశ్యకత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి

## బీజేపీ శ్రేణులకు సీఎన్ఆర్ పిలుపు



**వరంగల్ వాయిస్, కాటారం :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ, ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్నఅభివృద్ధిని ప్రజలకు తెలియజేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాదించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు చల్ల నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. కాటారం మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి హాజరైన బీజేపీ నాయకులు చల్లా నారాయణ రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డిలు పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి హాజరై బీజేపీ పార్టీ ముఖ్య కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అదే విధంగా పార్టీ కోసం కష్టపడ్డా ప్రతి ఒక్కరికి బీజేపీ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ దాదాపు 32 వేల పై చిలుకు ఓట్లు సాధించిందన్నారు. మేనిఫెస్టో కమిటీ చైర్మన్ గా మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఉచిత హామీలన్నింటిని రూప కల్పన చేసి ప్రజలకు ఆరు గ్యారంటీలు అనీ అబద్ధపు వాగ్దానాలు చేశారని, గెలిపించిన తెలంగాణ ప్రజలకు మొండి చేయి చూపిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలను పట్టించుకోకుండా ఢిల్లీ విహార యాత్రలు చేస్తున్నారని అన్నారు. ఉచిత బస్సు అని పెట్టి మహిళా సోదరిమనులను తిప్పలు పెడుతున్నారని సునీల్ రెడ్డి అన్నారు. మంథని నియోజకవర్గ ప్రజలకు శ్రీధర్ బాబును నమ్మి ఆరు గ్యారంటీలు, ఆరు పర్యాయాలు ఓట్లు వేసి గెలిపిస్తే మంథని నియోజకవర్గానికి ఆయన చేసిన అభివృద్ధి గుండు సున్నా అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండం మల్లా రెడ్డి, మాజీ అధ్యక్షుడు బొమ్మన భాస్కర్ రెడ్డి, కాటారం ఇంచార్జి సంపత్, బీజేపీ నాయకులు పాగే రంజిత్, చీర్ల తిరుపతి రెడ్డి, గంట అంకయ్య, చీర్ల బాపు రెడ్డి, దుర్గం తిరుపతి, డోలి అర్జయ్య, తోడే వీరా రెడ్డి, బండి రమేష్, అజ్మీరా వేణు, రాజేశం రెడ్డి, లాకు నాయక్ తదితరులు పాల్గొన్నారు

## మైసమ్మ తల్లికి బోనాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆషాడ మాసం సందర్భంగా నానామియా తోటలోని మైసమ్మ దేవతను స్థానిక ప్రజలు బోనాలు చేసి నైవేద్యం సమర్పించే కార్యక్రమానికి 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి హాజరయ్యారు. మైసమ్మ దేవతను దర్శించి డివిజన్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండి ఆరోగ్యంగా జీవనం గడుపుటకు తల్లి ఆశీర్వాదం ఉండాలని మైసమ్మ తల్లిని మొక్కారు. మైసమ్మ తల్లిని దర్శించిన వారిలో స్థానికులు సిలువేరు శీను, శెట్టి మోహన్, చీర రమేష్, చింతపట్ల ప్రశాంత్, చిలువేరు ఎల్లయ్య, బెజ్జం కిషన్ లు ఉన్నారు.

## పీడీఎస్‌యూ విద్యార్థులను విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బడ్జెట్ లో విద్యా రంగానికి 30 శాతం నిధుల్ని కేటాయించాలని, అన్ని యూనివర్సిటీలకు వీసీల నియమాకం చేయాలని, అన్ని రకాల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలనే డిమాండ్లతో బుధవారం పీడీఎస్ యూ రాష్ట్ర కమిటీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. అసెంబ్లీ నడుస్తుండగానే, దాని ఎదుట పీడీఎస్ యూ నాయకులు, కార్యకర్తలు జెండాలతో, కరపత్రాలతో ఒక్కపెట్టున ఆందోళనకు దిగారు. ఈ ప్రజాస్వామిక నిరసనను సహించలేని పోలీసులు విద్యార్థులపై దాడి చేస్తూ, దొరికిన వారిని దొరికినట్లు గా అరెస్ట్ చేసి, బండ్లగూడ, కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు, ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, ఉపాధ్యక్షులు నవీన్, ప్రణయ్ లతో పాటు ప్రవీణ్, శ్యామ్, నాగరాజు, యశ్వంత్, మహేష్, విజయ్ తదితర 30 మంది ఉన్నారు. గత అర్ధరాత్రి నుంచే ఈ కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి పోలీసులు సంగారెడ్డి జిల్లాలో సురేష్, నర్సింహారెడ్డి, సందీప్ లతో పాటు మొత్తం 12 మందిని ముందస్తుగా సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్ చెరువులలో అరెస్ట్ చేశారు. అలాగే, హైదరాబాద్ లో ఉపాధ్యక్షుడు సైదులును తెల్లవారు జామున ఇంటి వద్ద అరెస్ట్ చేసి అంబర్ పేట్ స్టేషన్ లో ఉంచారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా, కేవలం నిర్బంధం, అణచివేత ద్వారా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా తన వైఖరి మార్చుకోవాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కోరుతుంది. అరెస్ట్ చేసిన విద్యార్థి నాయకులను, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర నాయకుడు కె.గోవర్ధన్ డిమాండ్ చేశారు.

## ప్రమాద రహిత వారోత్సవాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అప్రమత్త డ్రైవింగ్‌తో ప్రమాదాలు నివారించవచ్చునని హనుమకొండ డిస్ట్రిక్ట్ ట్రాన్స్ పోర్ట్ అధికారి జి.వేణుగోపాల్ అన్నారు. ఈ నెల 24 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న ప్రమాద రహిత వారోత్సవాల సందర్భంగా హనుమకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ డిపోలో బుధవారం జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనం నడపాలని తెలిపారు. డ్రైవింగ్ చేస్తున్న క్రమంలో రోడ్డు సంకేతాలతో పాటు ఎదుటి వాహన కదలికలను కూడా గుర్తించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. హనుమకొండ మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ బి.కిషోర్ బాబు, హనుమకొండ ఆర్టీసీ డిపో ట్రాఫిక్ సూపర్ వైజర్ నజియా సుల్తానా, మెకానికల్ సూపర్వైజర్ వి.చంద్రశేఖర్, డ్రైవర్లు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరంయాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లను శాలువాతో సన్మానించారు.

## వైద్యులకు ప్రశంసాపత్రాలు అందజేత



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** హంటర్ రోడ్డులో బీసీ నేత హాస్టల్ లో సమైక్య వ్యాక్ పౌండేషన్ ప్రధాన కార్యదర్శి-బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, అశ్విన్ ఆరోగ్య ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 24 వరకు (పది రోజుల) వైద్య శిబిరం నిర్వహించారు. గత పది రోజులుగా ఉచిత వైద్య శిబిరానికి వేలాది మంది, దీర్ఘకాలిక రోగులతో ఇబ్బంది పడుతున్న ప్రజలు శిబిరానికి హాజరై, తగు వైద్య సేవలను వినియోగించుకున్నారు. చివరి రోజైన ఈ వైద్య శిబిరానికి సమైక్య వ్యాక్ పౌండేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ హాజరై ఇలాంటి వైద్య శిబిరాలు మునుముందు నిర్వహించేందుకు మా సమైక్య వ్యాక్ ఫౌండేషన్ సంస్థ ఎప్పుడు వెనుకాడదని తెలిపారు. వన్నాల అరవింద్ కుమార్ స్థాపించిన సమైక్య వ్యాక్ ఫౌండేషన్ ద్వారా సుమారుగా ఏడు వందలపై చిలుక కుటుంబాలకు నెలకు పది కిలోల నాణ్యమైన బియ్యం, పలు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, వారి కంటిచూపుకు ఆపరేషన్లు చేయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన ఇంటెన్షిప్ వైద్యులకు డాక్టర్ వన్నాల వెంకటరమణ, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు తాళ్ల సమ్మయ్య, విజయేందర్ కుమార్, అమిత్ కుమార్, వీరితో పాటు పదిమంది వైద్యుల బృందం పాల్గొన్నారు. వీరందరూ రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందినవారు.

## కొత్తకొండలో జేఎస్ఆర్ ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు డోలు సన్నాయి వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ పుట్టిన రోజున స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు చూపిస్తున్న ప్రేమ ఆప్యాయతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు కుడితాడి చిరంజీవి, వేలేరు మండల అధ్యక్షుడు రాజు, మధుకర్, వినోద్, కవిత, వీరన్న, రాజు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పంతం సురేందర్ ను తొర్రూరులోని విశ్రాంతి భవనంలో తొర్రూరు జర్నలిస్టులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పంతం సురేందర్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అక్రిడేషన్ కార్డ్స్, హెల్త్ కార్డ్ లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, వారి పిల్లలకు విద్యపైన ప్రభుత్వంతో చర్చించి వర్కింగ్ జర్నలిస్టుల అందరికీ ప్రభుత్వ పథకాలు అందే విధంగా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు వర్కింగ్ జర్నలిస్టులు పస్తం సాంబ, గాదె కృష్ణ, బషీర్, దిలీప్, ఉమేష్, మనోర స్వామి, ఎన్.శ్రీనివాస్, శివ, డి.యాకయ్య, నవీన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాంబారి సాయి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువనేత సాంబారి సాయి కుమార్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి రేగొండ మండల గుడెప్పల్లి గ్రామానికి చెందిన ఉమ్మడి వరంగల్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సాంబారి సమ్మారావు తనయుడు సాంబారి సాయి కుమార్ జన్మదిన వేడుకలకు ఉమ్మడి రేగొండ, గొరికొత్తపల్లి మండల వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వేడుకల్లో హజరయ్యారు. సాయి కుమార్ జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా పలువురు తీసుకొచ్చిన కేక్‌లను కట్ చేయించి ఆయనకు తినిపించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్, రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డితో పాటు పలువురు రాజకీయ నాయకులు, కుల సంఘాల నాయకులు సాయి కుమార్ జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు.

# అక్షయ్ కుమార్ ఖేల్ ఖేల్ మే

ఒకవైపు వరుస ఫ్లాప్‌లు ఎదుర్కొంటూనే తాజాగా మరో సినిమాను అనౌన్స్ చేశాడు బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్. ఆయన ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం 'ఖేల్ ఖేల్ మే'. ఈ సినిమాకు ముదస్సర్ అజీజ్ దర్శకత్వం వహిస్తుండగా.. కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో తాప్సీ పన్ను, వాణి కపూర్, అమ్మీ విర్క్, ఆదిత్య సీల్, ప్రగ్యా జైస్వాల్, ఫర్దీన్ ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం విడుదల తేదీని ప్రకటించింది.
ఈ సినిమాను ఇండిపెండెన్స్ కానుకగా ఆగస్టు 15న విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది అతిపెద్ద ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కి 'హలో' చెప్పండి! అంటూ పోస్టర్ కింద రాసుకొచ్చింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. మూడు జంటల నేపథ్యంలో సాగే కామెడీ డ్రామా అని తెలుస్తుంది. ఈ చిత్రం 2016 ఇటాలియన్ కామెడీ థ్రిల్లర్ 'పర్ఫెక్ట్ స్ట్రేంజర్స్ కి రీమేక్. అయితే ఇండిపెండెన్స్ బరిలో ఇప్పటికే బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్, కోలీవుడ్ నుంచి కలిపి ఐదు సినిమాలు బరిలోకి దిగుతున్నాయి. ఇందులో మూడు బడా సినిమాలో ఉండగా ఈ లీస్ట్‌లో అక్షయ్ కుమార్ సినిమాలో నాలుగుకు చేరింది. తెలుగు నుంచి రవితేజ మిస్టర్ బచ్చన్, రామ్ పోతినేని డబల్ ఇస్మార్ట్ వస్తుండగా.. కోలీవుడ్ నుంచి విక్రమ్ తంగలాన్, బాలీవుడ్ నుంచి స్త్రీ రాబోతున్నాయి. ఇక తాజాగా 'ఖేల్ ఖేల్ మే వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ రానుంది.






# ధనుష్ రాయన్ మూవీపై ఉత్కంఠ

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కాంపౌండ్ నుంచి వస్తోన్న క్రేజీ చిత్రాల్లో ఒకటి రాయన్, ధనుష్ స్వీయ దర్శకత్వంలో వస్తోన్న ఈ మూవీలో టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. నార్త్ మద్రాస్ బ్యాక్ డ్రాప్‌లో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న రాయన్ జులై 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ధనుష్ టీం ఇప్పటికే ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉంది.తాజాగా మేకర్స్ మరో స్టన్నింగ్ లుక్ విడుదల చేశారు. నుదుటన రక్తపు మరకలు, చెంపకు బ్యాండేజ్‌తో సీరియస్ అవతార్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌లో జోష్ నింపుతున్నాడు ధనుష్. ఇక తమిళనాడు వ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్ హాట్ కేక్‌లా మారిపోయాయి. కర్ణాటకలో ధనుష్ కెరీర్‌లో అత్యధిక థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలవుతున్న సినిమాగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. మేకర్స్ ఇప్పటికే విడుదల చేసిన రాయన్ ఫస్ట్ లుక్‌తోపాటు ఎస్‌జే సూర్య పోస్టర్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో అపర్ణ బాలమురళి, దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, విష్ణువిశాల్, కాళిదాస్ జయరామన్, సందీప్ కిషన్, సెల్వ రాఘవన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డీ50వ (ఆ50)గా వస్తోన్న ఈ మూవీకి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ మూవీని తెలుగులో ఏసియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ రిలీజ్ చేయనుంది. రాయన్ ట్రైలర్‌ను ఇటీవలే లాంచ్ చేయగా.. హై ఓల్టేజీ యాక్షన్ పార్టుతో సాగుతూ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది.

# ఆ సమయం ఎప్పుడొస్తుందా

## అని ఆత్రుతగా చూస్తున్నా..

బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ ఎన్టీఆర్‌పై  ఆసక్తికర కామెంట్స్ చేశారు. హిందీలో ఆమె నటించిన 'ఉలజ్' చిత్ర ప్రమోషన్లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అమితాబ్ బచ్చన్, హృతిక్ రోషన్, విక్కీ కౌశల్ వీరిలో ఎవరితో డ్యాన్స్ చేయాలని ఉందని అడగ్గా.. తనకు ఎన్టీఆర్‌తో కలిసి డ్యాన్స్ చేయాలనుందని మనసులో మాట బయటపెట్టారు. ప్రస్తుతం ఆమె తారక్‌తో కలిసి 'దేవర'లో  నటిస్తున్నాను. ఎన్టీఆర్‌తో కలిసి ఓ పాట షూటింగ్ పూర్తయింది. 'తారక్‌తో కలిసి ఓ పాటకు స్టెప్పులేశా. అతని డాన్స్‌లో  ఈజ్ బావుంది. ఎనర్జిటిక్ హీరో. అతని సపోర్ట్‌తో నేను కూడా అలవోకగా డాన్స్ చేశాను. అమ్మ మంచి డాన్సర్. నాకు కూడా డాన్స్  అంటే ఇష్టం. తారక్‌తో కలిసి స్టెప్పులేశాక మరింత ఉత్సాహం పెరిగింది. ఇప్పుడు రెండో పాట చిత్రీకరణ కోసం, ఆ సమయం ఎప్పుడొస్తుందా అని ఆతురతగా చూస్తున్నా' అని జాన్వీకపూర్ చెప్పారు.సముద్రతీరం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామా ఇది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ ఊరమాస్ అవతారంలో కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆయన అభిమానులు, సినీ ప్రియులు ఎంతగా ఎ÷-జగైటింగ్‌గా ఎదురుచూస్తున్నారు. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా కనిపించనుండగా.. కీలక పాత్రలో శ్రీకాంత్‌లో నటిస్తున్నారు. శివ కొరటాల రెండు పార్టులుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగాన్ని సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# యాక్షన్ సినిమాల్లో కిల్ ప్రత్యేకం

'స్నోఫియర్', 'కిల్'.. రెండూ వేర్వేరు కథలు. రెండింటిలోనూ ట్రైన్‌లో యాక్షన్ సీక్వెన్స్ మాత్రమే కామన్ పాయింట్ అని చెప్పారు యాక్షన్ కొరియోగ్రాఫర్ సీ యంగ్ ఓ లక్ష్ లల్వానీ  హీరోగా, తాన్య హీరోయిన్‌గా నటించిన 'కిల్' జులై 5న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మంచి టాక్, వసూళ్లు అందుకుంటున్న ఈ సినిమాకు దక్షిణ కొరియా చెందిన యాక్షన్ కొరియోగ్రాఫర్ సీ యంగ్ ఓ  పని చేసిన విషయం తెలిసిందే. ఆయన ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన యాక్షన్ చిత్రాలన్నిటిలో 'కిల్' ప్రత్యేకం. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం చాలా కష్టపడ్డాం. ట్రైన్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించడం కోసం నెలల సమయం పట్టింది. 'స్నోఫియర్', 'అవెంజర్స్'లో ఉన్న సీన్స్‌ను మరిపించేలా ఈ సినిమాలో సన్నివేశాలు ఉండాలని దర్శకుడు ముందే కోరారు. దీంతో ట్రైన్ యాక్షన్ సీన్స్‌ని సవాలుగా తీసుకొని చేశాం. ట్రైన్ లోపల ఉండే చిన్న స్థలంలో అలాంటి యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించడం కష్టం. వీటి కోసం ప్రత్యేక సెట్ వేశాం.. అయినప్పటికీ రోజూ ఎవరో ఒకరికి గాయాలయ్యేవి. అయితే ఎవరికీ ప్రమాదకరమైన గాయాలు కాలేదు' అని యంగ్ ఓ చెప్పారు.





# జక్కన్న సినిమా అంటేనే టాప్

### హాట్ కామెంట్స్ చేసిన రామ్ గోపాల్ వర్మ

తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి ఎస్ఎస్ఎంబీ 29. గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు - ఎస్ఎస్
రాజమౌళి కాంపౌండ్ నుంచి రాబోతుంది. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా ఇంటర్నేషనల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో రానున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. కాగా ఈ సినిమాపై రాంగోపాల్ వర్మ  సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు. ఓ ఇంటర్వ్యూలో ఎస్-ఎస్ఎంబీ 29 అన్ని సినిమాలకు బాప్‌గా ఉండబోతుందని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు వర్మ. దీని గురించి వర్మ మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ తర్వాత ఎస్ఎస్ రాజమౌళి ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ కోసం సాంకేతిక నిపుణుల బృందానికి అత్యధిక సమయాన్ని కేటాయిస్తున్నాడు. మహేశ్ బాబు, రాజమౌళి సినిమా మన ఊహలకు అందని విధంగా ఉండబోతుంద నుకుంటున్నానన్నాడు. ఎస్ఎస్ రాజమౌళి విజయం తెలుగు సినిమాకు సంబంధించినదని నేను అనుకోవడం లేదు. ఒకవేళ అతడు గుజరాత్ వ్యక్తి అయినా.. తను అలాంటి సినిమాలనే తెరకెక్కించి అవే అత్యున్నత శిఖరాలను వెళ్లేవాడంటూ ఆకాశానికెత్తేశాడు జక్కన్న. ఈ కామెంట్స్‌తో ఎస్ఎస్ఎంబీ 29పై



అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.  ఈ మూవీలో హాలీవుడ్ స్టార్‌తోపాటు వివిధ భాషలకు చెందిన నటీనటులు కనిపించబోతున్నారని తెలుస్తోండగా.. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. ఈ సినిమా కోసం మహేశ్ బాబు ఇప్పటికే లాంగ్ హెయిర్‌తో స్టైలిష్ లుక్‌లోకి మేకోవర్ అయ్యాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.



బుధవారం 24, జులై 2024
www.warangalvoice.net

# రెండు రోజుల్లో బండ్ పనులు పూర్తి కావాలి

## అధికారులను ఆదేశించిన కలెక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వర్షాల కారణంగా చింతనెక్కొండలోని దెబ్బతిన్న చెరువు బండ్ మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం పర్వతగిరి మండలం చింత నెక్కొండలో గల దెబ్బతిన్న చెరువు బండ్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బండ్ కు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బండ్ మరమ్మతు పనులను రెండు రోజుల్లో పూర్తిచేయాలని సాగునీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పర్వతగిరిలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. హాస్టల్ లో కల్పిస్తున్న సౌకర్యాలతోపాటు ప్రతిరోజు హాస్టల్లో అందిస్తున్న భోజనం ఎలా ఉంటుందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు వండిస్తున్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్ లోని విద్యార్థినిలకు గీజర్ ద్వారా వేడి నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేయాలని హాస్టల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హాస్టల్లో సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. సోలార్ విద్యుత్ కు సంబంధించిన మరమ్మతులు వెంటనే చేయించి నిరంతరం విద్యుత్తు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థినిలకు అందిస్తున్న చికెన్ భోజనం నాణ్యతగా ఉందా లేదా అనేది తెలుసుకునేందుకు భోజన శాంపిల్స్ లను ఫుడ్ సేఫ్టీ అధికారులు పరీక్షించాలని అధికారులను ఆదేశించగా భోజనాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారుల పరీక్షల నిమిత్తం వరంగల్ కు తరలించారు. అనంతరం పర్వతగిరి వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతులతో కలెక్టర్ సమావేశమయ్యారు. రుణమాఫీ గురించి స్థానిక రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంతమంది రైతులకు రుణమాఫీ వర్తించిందని, ఇంకా ఎంతమందికీ ఈ పథకం వర్తినుంచనుందనే వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ ను కూడా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ లో వర్షాల కారణంగా విద్యుత్తు అసౌకర్యం కలుగుతోందని సూచించారు. ఈ హాస్టల్ కు ప్రత్యామ్నాయంగా విద్యార్థినులను పర్వతగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సౌకర్యాలు కల్పించి వెంటనే విద్యార్థినిలను తరలించాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో శంకర్, ఎంపీఓ శ్రీనివాస్, అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రశాంత్, సాగునీటిపారుదల శాఖ ఏఈ ప్రశాంత్, కాడబోయిన వెంకటస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణపై మోడీ వివక్ష

## బీజేపీ ఎంపీలు ప్రజలకు సమాధానం చెప్పాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోడీ మొండి చేయి చూపి తెలంగాణ పట్ల తన వివక్షను, విద్వేషాన్ని ప్రదర్శించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు ఆరోపించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో హనుమకొండ కాళోజీ సెంటర్ లో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మొదటి నుంచి తెలంగాణ పట్ల ప్రధాని మోడీ సవతి తల్లి ప్రేమే చూపిస్తున్నారన్నారు. గత పదేళ్లుగా రాష్ట్రానికి అన్యాయం చేస్తూనే వచ్చారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన మోడీ తెలంగాణ అభివృద్ధిని కూడా మొదటి నుంచి అడ్డుకుంటూ వస్తున్నాడని దుయ్యబట్టారు. గత పార్లమెంటు ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు తిరస్కరించిన బలహీన ప్రధానమంత్రి అయిన మోడీ తన కుర్చీ నిలుపుకోవడం కోసం ఏపీ, బీహార్ సీఎంలకు భయపడి ఆ రాష్ట్రాలకే అధిక నిధులు కేటాయించారని విమర్శించారు. మోడీ దేశానికి ప్రధాన మంత్రా లేక బీహార్, ఏపీ రాష్ట్రాలకే ప్రధానా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి అధిక నిధులు రాబట్టడంలో విఫలమైనందుకు కేంద్ర మంత్రులైన కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో పాటు బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో అన్ని ప్రాంతాలను, రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన దేశ ప్రధాని, ఆర్థిక మంత్రి కొన్ని రాష్ట్రాలకే నిధులు కేటాయించి, తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించడాన్ని ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేస్తారని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్.అశోక్ స్టాలిన్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, జక్కు రాజు గౌడ్, నిమ్మల మనోహర్, శంకర్ నాయక్, రమేష్ దేవా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు



# కలెక్టరేట్‌లో సేవా కేంద్రం ఏర్పాటు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాల కొరకు ఇంత క్రితమే దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు తమ దరఖాస్తుల్లో ఉన్న తప్పులను సరి చేసుకునేందుకు హనుమకొండ కలెక్టరేట్ లో సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఈ సేవా కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ప్రావీణ్య తనిఖీ చేసి అక్కడున్న అధికారులతో మాట్లాడారు. ఎవరైనా దరఖాస్తుదారులు సరి చేసుకోవడానికి వస్తే వెంటనే వారి దరఖాస్తును పరిశీలించి సరి చేయాలని ఆదేశించారు. గ్యాస్ సిలిండర్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారు గ్యాస్ పాస్ బుక్, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్ తీసుకువచ్చి సరి చేసుకోవాలన్నారు. అలాగే గృహ జ్యోతి పథకం కొరకు దరఖాస్తు చేసుకున్న వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, తీసుకొచ్చి సరి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# స్మితా సబర్వాల్ పై చర్య తీసుకోవాలి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** విషయం:వికలాంగులను కించపరిచే విదంగా పోస్ట్ పెట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ పై చర్య తీసుకోవాలని నవ తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి అజీమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గ్రేటర్ వరంగల్ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఆమెను విధులనుంచి తొలగించాలని కోరారు. వికలాంగులకు బహిరంగ క్షమాపన చెప్పాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో ఎన్డీఏ కూటమి తన మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. బీజేపీ కూటమిలోని ఎన్డీఏలో జేడీయూ, టీడీపీ రెండు పార్టీల ఎంపీ అభ్యర్థుల మద్దతు బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు అనివార్యమైంది. దీంతో బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కావలసినటువంటి స్పెషల్ స్టేటస్ ల గురించి ప్రధానమంత్రి మోడీకి నితీష్ కుమార్, చంద్రబాబు విన్నవించుకున్నారు. గత 10 ఏళ్లుగా కేంద్ర బడ్జెట్ లోని బీజేపీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై పెద్దగా పట్టింపు లేకుండా వ్యవహరిస్తూ ఉత్తరాది రాష్ట్రాల్లో ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రమే ఎక్కువగా బడ్జెట్ కేటాయింపు జరిగాయి. తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతూనే ఉందనడానికి పదేళ్ల బడ్జెట్ ని చూస్తే మనకు అర్థమవుతుంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రాలకు ఉన్న హక్కుల ద్వారా వారికి కేటాయించాల్సినటువంటి వాటాలను కేంద్ర ప్రభుత్వం సక్రమంగా కేటాయిస్తలేదు. అలా కేటాయింపు జరిగితే ప్రతి రాష్ట్రం కూడా అభివృద్ధి దిశగా పయనించే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర సహకారంతో తమ బడ్జెట్ ను కలుపుకొని సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికను రూపొందించుకుంటాయి.

కానీ గత కొన్ని ఏళ్ళుగా కేంద్రం తెలంగాణకు సహకరించకపోవడంతో రాష్ట్రం చాలా నష్టపోయింది. గత ప్రభుత్వాలు రాష్ట్ర ఆదాయం నుంచే ప్రభుత్వాన్ని నడిపించారు. ఒకవైపు అప్పులు చేస్తూ మరోవైపు రాష్ట్ర రాబడి నుంచి సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించే ప్రయత్నం చేసింది. మరోవైపు కాళేశ్వరం లాంటి ఒక జాతీయ హోదా పొందాల్సిన ప్రాజెక్టుకి కేంద్ర సహకారం లేకున్నా ఆ ప్రాజెక్టును పూర్తి చేసింది. ఆనాటి ప్రభుత్వం అప్పు చేసి ప్రపంచంలోనే అతి త్వరగా అతి పెద్దదైనటువంటి ఎత్తిపోతల ప్రాజెక్టుని నిర్మించి దేశాన్ని ఆశ్చర్యపరిచింది. ఫలితాలు ఏమైనప్పటికీ కూడా కాళేశ్వరం ప్రాజెక్టు కొన్ని ఏళ్ల నుంచి చర్చలో ఉండసాగింది. అప్పటి ప్రభుత్వం కాళేశ్వరానికి జాతీయ హోదా కోసం ప్రయత్నాలు చేసింది. కానీ, కేంద్రం ఈనాడు కూడా దాన్ని పట్టించుకోకుండా బుట్ట దాఖలు చేసింది.

తెలంగాణ ప్రజలు గతంలో ఎప్పుడూ లేనటువంటి విధంగా పార్లమెంటు ఎన్నికలో కేంద్ర పార్టీలకు పట్టం కట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి 8 సీట్లు, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి 8 సీట్లను గెలిపించి తెలంగాణ ప్రజలు కేంద్రంలో బీజేపీ అధికారంలో రావడానికి ముఖ్య భూమిక పోషించారు. గతంలో ఎన్నడూ లేనటువంటి సంఖ్యా బలాన్ని బీజేపీకి తెలంగాణ ప్రజలు అందించినప్పటికీ, ఎన్డీఏ (బీజేపీ) తెలంగాణ ప్రజల్ని మరోసారి మోసం చేసింది. కేంద్ర బడ్జెట్ లో ఎక్కడ కూడా తెలంగాణకు లాభం చేకూర్చే విధంగా రావలసిన హక్కులను, వాటాలను ప్రస్తావించకుండానే బడ్జెట్ ను ముగించారు. ఒకవైపు ఆంధ్ర, బీహార్ రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జేడీయూ, టీడీపీల మద్దతు బీజేపీకి అవసరమైనది కాబట్టి, బీహార్ కు రూ.26 వేల కోట్లు, ఏపీకి రూ.15 వేల కోట్లు, వారి రాష్ట్రాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించి ఈ బడ్జెట్ ద్వారా బీజేపీ తమ ప్రభుత్వాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసింది.

తెలంగాణకి బడ్జెట్ లో అన్యాయం జరుగుతున్నప్పటికీ కూడా తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యాన్ని వహిస్తున్న బీజేపీ ఎంపీలు మౌనం వహించడం శోచనీయం. తెలంగాణ ప్రజల హక్కులను కాలరాస్తున్నటువంటి బీజేపీ ప్రభుత్వానికి భవిష్యత్తులో గుణపాఠం చెబుతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పై తెలంగాణ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. ఒక వైపు మేదావులు అంతా కూడా ఈ బడ్జెట్ పై చర్చలు చేస్తూ దీనివల్ల సామాన్య, మధ్యతరగతి, పేద వర్గాలకు న్యాయం జరిగే అవకాశం లేదంటున్నారు. కాబట్టి, భవిష్యత్తులోనైనా కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ప్రతి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి తమ రాష్ట్ర మంత్రులను, ముఖ్యమంత్రులను, అన్ని పార్టీలను పిలిచి తమకు కావలసినటువంటి హక్కులను, వాటాలను కొంత వరకైనా నెరవేరిస్తే బాగుంటుంది.



వ్యాసకర్త :
తాడిశెట్టి క్రాంతి కుమార్
తెలంగాణ ఉద్యమకారుడు,
సామాజిక కార్యకర్త

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com